సాక్షి ఆదిలాబాద్

ఆదివారం ၊ 11 ၊ జూన్ ၊ 2023



ఘనంగా ఇప్పపువ్వు పండుగ

ఉట్నూర్‌లోని కేబీ ప్రాంగణంలో ఇప్పపువ్వు పండుగ శనివారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ తదితరులు హాజరయ్యారు.

8లో▸

రిమ్స్‌కు ఐదు పీజీ సీట్లు మంజూరు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ కళాశాలకు కొత్తగా ఐదు పీజీ సీట్లు మంజూరయ్యాయి. వీటి కోసం అధికారులు గతంలో దరఖాస్తు చేయగా ఇటీవల ఎన్ఎంసీ బృందం కళాశాలను సందర్శించి వసతులు పరిశీలించింది. రెస్పిరెటరీ మెడిసిన్ విభాగంలో ఐదు సీట్లకు అనుమతి ఇచ్చింది. ఎన్ఎంసీ నిర్ణయాన్ని స్వాగతిస్తూ రెస్పిరేటరీ విభాగం ఆధ్వర్యంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్‌ను శనివారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ సందీప్ జాదవ్, వైద్యులు రమేశ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
41.0/29.0

మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలన్నారు. తద్వారా డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. పోలీసులు కూడా వారి పరిధిలో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి డాక్టర్ శివరామ్ ప్రసాద్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల జైన్, జూనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవార్, బార్ అసోసియేషన్ సభ్యులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవం పురస్కరించుకుని కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు జెడ్పీసమావేశ మందిరంలో 'తెలంగాణ అస్తిత్వం–తెలంగాణ సాధించిన ప్రగతి' అంశంపై నిర్వహించే సమ్మేళనంలో తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ కవులు కవితాగానం చేయనున్నారని పేర్కొన్నారు. కవులు, సాహితీవేత్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

12న తెలంగాణ రన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈ నెల 12న తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ఉదయం 6 గంటలకు రన్ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ శిక్షణ అభ్యర్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, క్రీడా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వరాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు



క్యూసీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఈఈ

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక చేపట్టిన రోడ్లు, భవనాల నిర్మాణాలతో తమ శాఖకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు దక్కిందని ఆర్ అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నర్సయ్య అన్నారు. జిల్లాకు కొత్తగా మంజూరైన ఆర్అండ్‌బీ బిల్డింగ్ సబ్ డివిజన్, జాతీయ రహదారులు, క్వాలిటీ కంట్రోల్, బిల్డింగ్ ఏఈ కార్యాలయాలను శనివారం ప్రారంభించారు. సంబంధిత డీఈ, ఏఈలను వారి సీట్లలో కూర్చోబెట్టి అభినందనలుతెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక ప్రతీ గూడెం, తండాకు తారురోడ్లు ఏర్పడ్డాయన్నారు. మండల కేంద్రాలకు లింక్ రోడ్లతో పాటు జిల్లా కేంద్రంలో ఆరు వరుసల రహదారిని కోట్ల వ్యయంతో నిర్మించుకున్నామని గుర్తుచేశారు. లో లెవల్ వంతెనలతో ఏటా వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందులను బ్రిడ్జిల నిర్మాణంతో పూర్తిగా దూరం చేశామన్నారు. కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు సైతం త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ సురేశ్ రాథోడ్, ఏఈలు అరుణ్, భూపేష్, అరవింద్, సునీల్, ఎస్ఈ కార్యాలయ సూపరింటెండెంట్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ బాటలో..

- రసాయన ఎరువుల వినియోగానికి స్వస్తి
- 'ప్రకృతి' విధానంలోనే పంటల సాగు
- ప్రజారోగ్యానికి భరోసానిస్తూ..
- ఆదర్శంగా నిలుస్తున్న రైతులు

జిల్లాలో ..	సాగు విస్తీర్ణం : 5.60 లక్షలు	మొత్తం రైతులు : 1.50లక్షలు	సేంద్రియ పంటల సాగు: 10 వేల ఎకరాలు	సేంద్రియ రైతులు : 500



సేంద్రియ ఎరువు చల్లుతున్న రైతు కుటుంబ సభ్యులు

వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో రైతులు రసాయనిక ఎరువులు ఇబ్బడి ముబ్బడిగా వినియోగిస్తున్నారు. ఇవి మోతాదుకు మించడతో పెట్టుబడి కూడా పెరుగుతోంది. భూసారం సైతం దెబ్బతింటోంది. ఇలా వచ్చిన ఆహార ఉత్పత్తుల దిగుబడి ప్రజల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని లేకుంటే ముప్పుతప్పదని వైద్యులతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితులను గమనించిన జిల్లాలోని పలువురు రైతులు సేంద్రియ సాగుబాట పట్టారు. ఆవుపేడతో వివిధ రకాల కషాయాలు, ద్రావణాలు తయారు చేసుకుని పంటలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. నాణ్యమైన పంట ఉత్పత్తులు అందిస్తూ ప్రజారోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు. వీటికి మార్కెట్‌లోనూ మంచి డిమాండ్ ఉండటం వారికి ఆర్థికంగా కలిసి వస్తుంది.సేంద్రియ బాట పట్టిన పలువురు అన్నదాతలపై కథనం.

– కైలాస్‌నగర్

గంభీర్ ఆలోచన.. ఆదర్శనీయం

జైనథ్ మండలం అడ గ్రామానికి చెందిన ఊన గంభీర్ తనకున్న 2.5 ఎకరాల్లో పూర్తిగా సేంద్రియ విధానంలోనే పంటలు సాగుస్తున్నాడు. ఈ యాసంగిలో సోయా, శనగ, పెసర వేశాడు. ఈ సాగుపై ఉన్న ఆసక్తితో ప్రత్యేకంగా తన పొలంలోనే వర్మీ కంపోస్టు యూనిట్ ఏర్పాటు చేసి ఎరువుల ఉత్పత్తిని ప్రారంభించాడు. ఒక్కో ట్యాంకులో 20 నుంచి 25 కిలోల ఎర్రలను వదిలితే అవి 30 బస్తాల వరకు ఎరువును ఉత్పత్తి చేస్తున్నాయి. ఏడాదికి సుమారు 400 బస్తాల వరకు ఉత్పత్తి అవుతుండగా తన పంటలకు పోనూ మిగిలిన దానిని జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ నేచురల్ స్టోర్‌లో బస్తా రూ.500 చొప్పున విక్రయిస్తున్నాడు. పంట ఉత్పత్తులతో పాటు సేంద్రియ ఎరువు విక్రయం ద్వారా మూడునెలలకు గాను సుమారు రూ.2లక్షల వరకు ఆదాయం అర్జిస్తునాడు. జిల్లాలో తొలి సేంద్రియ రైతుగా గుర్తింపు పొందిన ఈయన ప్రభుత్వ పరంగా ఇప్పటికే అనేక పురస్కారాలు అందుకోవడం గమనార్హం.



నాణ్యమైన ఉత్పత్తులే లక్ష్యంగా.. రమేశ్వర్



ప్రకృతి సేద్యంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడితో పాటు ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందిస్తున్నాడు ఇచ్చోడ మండలం నవేగాంవ్ గ్రామానికి చెందిన గైక్వాడ్ రమేశ్వర్. తనకున్న ఐదెకరాల పొలంలో 2014 నుంచి పసుపు, గోధుమ, కంది, శనగ, కుసుమతో పాటు టమాట, వంకాయ, సోర, తీగ జాతి పంటలను పూర్తిగా సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నాడు. ఇందులో ఆవు పంచకం, ద్రవ, ఘన జీవామృతం, చెట్ల ఆకులతో తయారు చేసిన ఎరువులను వినియోగిస్తున్నాడు. తద్వారా భూసారం కాపాడటంతో పాటు పర్యావరణానికి సైతం మేలు చేకూరుతుంది. ప్రజారోగ్యానికి నాణ్యమైన ఉత్పత్తులు అందించాలనే ఉద్దేశంతోనే తాను ఈ సాగుకు శ్రీకారం చుట్టినట్లుగా చెబుతున్నాడు ఈ రైతు.

రసాయన అనర్థాలను గుర్తించిన.. రవీందర్



గుడిహత్నూర్ మండలం తోషం గ్రామానికి చెందిన పస్తాపురే రవీందర్ సేంద్రియ సాగులో ఆదర్శంగా నిలుస్తున్నాడు. తనకున్న ఏడున్నర ఎకరాల్లో సగం వరకు పత్తి వేస్తున్నాడు. మిగతా భూమిలో టమాట, వంకాయ, చిక్కుడు, పసుపు, గోధుమ, వరి, జొన్న, నువ్వు పంటలను పూర్తిగా సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నాడు. రసాయన ఎరువుల వినియోగంతో కలిగే అనర్థాలను గుర్తించి పాలేకర్ విధానంలో సాగుకు శ్రీకారం చుట్టినట్లు చెబుతున్నాడు ఈయన. ఏడేళ్లుగా ఇదే విధానం కొనసాగిస్తున్నానని, ప్రారంభంలో కొంత నష్టాలు వచ్చినా వెనుకడుగు వేయలేదని అంటున్నాడు. ఆదిలాబాద్ నేచురల్స్ షాప్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్‌లోనూ తన పంట ఉత్పత్తులను విక్రయిస్తున్నానని చెబుతున్నాడు రైతు రవీందర్.

పాలేకర్ స్ఫూర్తితో.. శ్రీనివాస్‌రెడ్డి



రసాయనిక ఎరువులతో పంటలు పండించడం ద్వారా పెట్టుబడి పెరగడంతో పాటు నేలల్లో సారం తగ్గిపోతుంది. ఈ క్రమంలో పాలేకర్ తరగతులు విని సేంద్రియ సాగు చేయాలని నిర్ణయించుకున్నానని చెబుతున్నాడు జైనథ్ మండలం కరంజీ గ్రామానికి చెందిన సోమ శ్రీనివాస్ రెడ్డి. 2014 నుంచి తనకున్న పదెకరాల పొలంలో పత్తి, కంది, సోయా, వేరుశనగ వంటి పంటలను పూర్తిగా సేంద్రియ విధానంలోనే సాగు చేస్తున్నాడు. దిగుబడి కొంత తగ్గినా మార్కెట్‌లో ఈ ఉత్పత్తులకు డిమాండ్ ఉండటంతో ఆర్థికంగా మేలే జరుగుతుందని అంటున్నాడు ఈ రైతు.

పునర్విభజనతో చేరువైన పాలన

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: స్వరాష్ట్రంలో జిల్లా, మండల, గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థకరణతో ప్రజలకు దూరభారం తగ్గి పాలన చేరువై మెరుగైన సేవలు అందుతున్నయని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణ చేపట్టి సాగు విస్తీర్ణం పెంచామన్నారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా గ్రామంలోని ప్రతీఇంటికి శుద్ధ జలం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు సాధారణ ప్రసవాల సంఖ్య పెంచి, మాతా శిశు మరణాలను నియంత్రించగలిగామని వెల్లడించారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుతో గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సాకారం అయిందని వెల్లడించారు. అంతకు ముందు పలు శాఖల అధికారులు తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని వివరించారు. ప్రభుత్వ గొప్పతనాన్ని చాటేలా సాంస్కృతిక సారథి కళాకారులు ఆడిపాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మనోహర్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో కిషన్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

తాంసి: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతూ సీఎం కేసీఆర్ సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. భీంపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఏర్పాటు చేసిన సుపరిపాలన దినోత్సవంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం మండలంలోని 28 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ రత్నప్రభ సంతోష్, సర్పంచ్ లింబాజీ, ఎంపీటీసీ అన్నపూర్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో జోష్ !

- సీఎం పర్యటనలతో కేడర్‌లో ఉత్సాహం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై గులాబీ బాస్ ఫోకస్
- ఈ నెల 24న ఆసిఫాబాద్ జిల్లాకు రాక



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ బహిరంగ సభలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. వరుస సభల విజయవంతం ఉత్సాహాన్నిస్తోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఈ నెల 2 నుంచి 22వరకు 21రోజులపాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకులు పాల్గొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఆవిర్భవించిన నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో కలెక్టరేట్ భవనాలు, అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రగతి నివేదన సభలతో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరిస్తున్నారు. ఈ నెల 6న నిర్మల్ జిల్లా పర్యటన, 9న మంచిర్యాల జిల్లాలో కొత్త కలెక్టరేట్లు, జిల్లా పార్టీ కార్యాలయాలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ నెల 24న కుమురంభీం జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉంది. కలెక్టరేట్, పార్టీ కార్యాలయం ప్రారంభం, బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఒకే నెలలో వరుస పర్యటనలు ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

ఎన్నికలకు ముందే..

వచ్చే శాసనసభ ఎన్నికలకు ముందే ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ఓటర్లను సీఎం ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న పనులను 'ప్రగతి నివేదన సభ'లో ప్రజలకు వివరిస్తున్నారు. కేసీఆర్ సభలకు తోడు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సైతం ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నారు. గత నెల 8న బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రగతి నివేదన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్య నాయకుల రాకతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికలకు ముందే సభల నిర్వహణతో కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఎన్నికలు సమీపించే నాటికి తమ బలాన్ని పెంచుకునేలా అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. వచ్చే డిసెంబర్‌లోపు రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సమయాన్ని తమకు కీలకంగా భావిస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత, నాయకులు, ప్రజాప్రతినిధులపై అసంతృప్తిని తొలగించేలా జిల్లాల్లో పర్యటనలు, సభలు చేపడుతున్నారు. ఎన్నికలకు ముందే భారీగా వ్యయం చేస్తూ సభలు విజయవంతం అయ్యేలా ప్రణాళిక రచిస్తున్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు తిప్పికొట్టేందుకు, అధికార పార్టీ ఎమ్మెల్యేలకు బలం చేకూర్చేలా అగ్రనాయకుల పర్యటనలు సాగుతున్నాయి.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేలా..

ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు, నిరసనలు తిప్పికొట్టేలా, ప్రజల్లో అధికార పార్టీపై పట్టుకోల్పోకుండా వ్యవహరిస్తున్నారు. వరుసగా రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో మూడోసారీ విజయం సాధించేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రస్తుత ఎమ్మెల్యేలందరూ వరుసగా రెండు మూడుసార్లు గెలిచిన వారే ఉన్నారు. వీరిపై సాధారణంగా జనంలోనూ వ్యతిరేకత ఉంది. దీంతో మరోసారి అధికారంలోకి రావాలంటే ఎన్నికలకు ముందే సమగ్రంగా ప్రణాళికలు వేసుకుని అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ, తదితర పార్టీలు బలపడకుండా ముందే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

నేడు గ్రూప్‌–1 పరీక్ష

- జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు
- 19 కేంద్రాలు.. 6,190 మంది అభ్యర్థులు
- 15 నిమిషాల ముందే గేట్లు మూసివేత
- సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించే గ్రూప్‌–1 రాత పరీక్షకు సర్వం సిద్ధమైంది. ఆదివారం నిర్వహించే పరీక్షకు గాను జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 6,190 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇందులో 5,886 మంది తెలుగు మీడియం, 304 మంది ఉర్దూ మీడియంకు చెందిన ఉన్నారు. పరీక్ష ఉదయం 10:30 నుంచి ప్రారంభం కానుండగా అభ్యర్థులను 8:30 నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 15 నిమిషాల ముందుగానే గేట్లను మూసివేయనున్నారు. 10.15 గంటల తర్వాత ఎవరినీ అనుమతించరు. అభ్యర్థులతో పాటు సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు, ఇన్విజిలేటర్లు, సిబ్బంది ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు కేంద్రాల్లోకి తీసుకువెళ్లడానికి అనుమతి లేదు. పరీక్ష పకడ్బందీగా నిర్వహించేలా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపనుంది. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1939 తో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

పట్టణ శివారులోని నలంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం పరిశీలించారు. కేంద్రంలోని గదులు, వసతులతో పాటు సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావు, లైజన్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో స్పెషల్ బస్సులు

ఆదిలాబాద్: గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. ఉట్నూరు నుంచి జిల్లా కేంద్రానికి ఉదయం 5 గంటల నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు, బోథ్ నుంచి 6:45గంటలకు, 7:45, బేల నుంచి 6:00, 7:30, కరంజి నుంచి 6:30, 7:10, బరంపూర్ నుంచి 6:30, తలమడుగు నుంచి 6:30, పెండల్వాడ నుంచి 6 గంటలకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు.అభ్యర్థులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఆదిలాబాద్‌టౌన్: గ్రూప్‌–1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఉదయకుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ అధికారులతో శనివారం సమావేశమయ్యారు. పట్టణంలో పరీక్ష నిర్వహిస్తున్న 19 కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోనికి అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. బందోబస్తులో అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 30 మంది ఎస్సైలు, 26 మంది ఏఎస్సైలు, 42 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 164 మంది కానిస్టేబుళ్లు, 30 మంది హోంగార్డులు స్పెషల్ పార్టీ, బీడీ టీం, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొంటారని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద గల జిరాక్స్ సెంటర్లు అన్నింటిని మూసివేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సమైజాన్ రావు, డీఎస్పీలు ఉమేందర్, ఉమామహేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్బీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న రాజకీయాలు

- దశాబ్ది ఉత్సవాలను అనువుగా మార్చుకుంటున్న బీఆర్ఎస్
- గడపగడపకూ కాంగ్రెస్‌తో 'హస్తం' దూకుడు
- ప్రభుత్వ వ్యతిరేక నిరసన కార్యక్రమాల్లో బీజేపీ బిజీ

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీల్లో సందడి కనిపిస్తుంది. ప్రచార పర్వం ఊపందుకుంటుంది. తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకలను అధికార పార్టీ బీఆర్ఎస్ అనువుగా మార్చుకుంటుంది. ఇక హస్తం పార్టీ గడపగడపకూ కాంగ్రెస్ పేరిట ప్రజల వద్దకు వెళ్తుంది. మరోవైపు ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ బీజేపీ నిరసన కార్యక్రమాలు చేపడుతూ ప్రజల పక్షాన నిలిచేందుకు యత్నిస్తోంది. మొత్తంగా ఎన్నికలు ఎప్పుడొచ్చినా తాము సిద్ధమే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి ప్రధాన పార్టీలు.

బీఆర్ఎస్..

ఈనెల 22 వరకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది వేడుకల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. తొమ్మిదేళ్ల పాలనలో తమ సర్కారు చేసిన అభివృద్ధిని రోజుకో కార్యక్రమం ద్వారా వివరిస్తూ అందరినీ ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల సభల్లో పాల్గొనడం గులాబీ పార్టీలో ఉత్సాహం కలిగిస్తుంది. తాజాగా దివ్యాంగుల పింఛన్ పెంచడాన్ని అధికారపార్టీ విస్తృతంగా ప్రచారం చేసుకుంటుంది. ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, రేఖాశ్యామ్ నాయక్, ఆత్రం సక్కు ఇందులో పాల్గొంటున్నారు. శ్రేణులను ఉత్సాహపరుస్తున్నారు.

కాంగ్రెస్..

హస్తం పార్టీ విషయానికొస్తే జిల్లాలో ఆ పార్టీ నేతలంతా ఒక్కటై గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా ప్రజలను కలుస్తూ ముందుకు సాగుతున్నారు. మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి మార్గదర్శకత్వంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత తదితరులు ఇంటింటికీ వెళ్లి పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. మరోవైపు ఇటీవల పార్టీలో చేరిన కంది శ్రీనివాస్‌రెడ్డిని పారాచూట్ నేతగా పాతనేతలంతా అభివర్ణిస్తున్నారు. ఇక బోథ్ నియోజకవర్గంలో అడె గజేందర్, వన్నెల అశోక్ పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు.

బీజేపీ..

కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రజా సంపర్క్ యాత్ర ద్వారా బీజేపీ ప్రజల్లోకి వెళ్తోంది. అలాగే అధికార పార్టీ అక్రమాలను ఎండగడుతూ నిరసనలు చేపడుతోంది. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువు కబ్జాపై జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అలాగే రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నెలకొల్పుతామని తీసుకున్న భూములను నిర్వాసితులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినీరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసీ గూడాల్లో రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు సైతం చేపట్టారు.

వివిధ వర్గాలను ఆకట్టుకునే దిశగా..

ఇక ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల జిల్లా కేంద్రంలో పర్యటించి బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే వివిధ వర్గాల ప్రజలను ఆకర్షించేందుకు పలు పార్టీలు యత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ జిల్లా కేంద్రానికి విచ్చేయడం గమనార్హం. అలాగే విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ సభలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నియామకం పారదర్శకంగా చేపట్టాలి

ఎదులాపురం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలో పాఠశాలలో నూతన సీఆర్టీల నియామకాలు పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐటీడీఏ అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో ప్రకటనలో వెలువడించకపోవడంపై ఆదివాసీ అభ్యర్థుల్లో అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. భర్తీ ప్రక్రియ రహస్యంగా కాకుండా మెరిట్ జాబితా బహిరంగపరిచి అభ్యర్థుల ఎంపిక చేయాలని కోరారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన తప్పవని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైరు చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న రవితేజ

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ చేనులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని కాపర్ తీగను దొంగిలించారు. విద్యుత్ ఏఈ మహేష్ వివరాల ప్రకారం... మండలంలోని కనకాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ చేనులోని 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం అర్ధరాత్రి పగులగొట్టి అందులోని కాపర్‌తీగను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా అందులోని కాపర్ తీగ దొంగిలించినట్లు గుర్తించారు. దీని విలువల రూ.లక్ష రూపాయలు ఉంటుందని ఏఈ మహేష్ తెలిపారు.

గొడ్డలితో దాడి.. కేసు నమోదు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో భూతగాదాల నేపథ్యంలో గొడ్డలితో దాడిచేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం... సూర్యవంశీ ఆకాష్, సూర్యవంశీ అంబాదాస్‌ల మధ్య కొన్నేళ్లుగా భూతగాదాలు ఉన్నాయి. సూర్యవంశీ అంబాదాస్, పాండురంగ్‌లపై సూర్యవంశీ ఆకాష్, ఆనంద్‌రావులతో పాటు అనూష గొడ్డలి, కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు కుటుంబ సభ్యురాలు రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.

బాసరలో కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

భైంసా: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బాసరలో శనివారం ఘనంగా కవి సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేర కు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. స్థానిక బాసర దేవస్థాన ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన పలువురు కవులు పాల్గొన్నారు.

టమాటా రైతుల ఆనందం



లోకేశ్వరంలో సాగవుతున్న టమాటా పంట



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా టమాటా

- 25 కిలోల బాక్స్ రూ.800
- నిలకడగా ధరలు

లోకేశ్వరం: ప్రస్తుత సీజన్‌లో టమాటా సాగు చేసిన రైతుల ముఖంలో ఆనందం వ్యక్తమవుతోంది. ధర పెరగడంతో మంచి ఆదాయం సమకూరుతుండడమే ఇందుకు కారణం. ప్రస్తుతం టమాటా 25కిలోల బాక్సు రూ.800–1000 పలుకుతోంది. కిలో చొప్పున విక్రయించే రైతులకు 25కిలోలకు వెయ్యి రూపాయల వరకు ఆదాయం వస్తోంది. ధర బాగుండడంతో లాభాలు వస్తున్నాయి. ముధోల్ డివిజన్ సుమారు ఎనిమిది వందల ఎకరాల్లో టమాటా పంటను సాగు చేశారు. వ్యాపారులే వ్యవసాయ క్షేత్రాలకు వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. దీనిని జిల్లా అవసరాలకే కాకుండా మహారాష్ట్రలకూ తరలిస్తున్నారు. ఎకరం సాగు చేస్తే పంట పూర్తయ్యే వరకు వెయ్యి బాక్స్‌ల టమాట పంట దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. రోజు తప్పిరోజు ఎకరం భూమిలో 20 నుంచి 30 బాక్స్‌ల టమాట పంట వస్తుంది. ప్రస్తుతం టమాటా దిగుబడి కూడా బాగుంది.

నిలకడైనా ధర..

ప్రస్తుతం టమాటా పంటకు లభిస్తున్న ధరతో టమాట రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెలన్నర రోజుల నుంచి టమాట పంటకు నిలకడైనా ధర లభిస్తోంది. ముందుగా బాక్సు రూ.600 నుంచి 800 పలుకుతుంది. తరువాత రూ. 550 తగ్గింది. అప్పటి నుంచి 600 కంటే తక్కువ ధర ఏనాడూ పలకలేదు. ఇంత నిలకడగా టమాట పంటకు ధర ఉండడం ఇదే మొదటిసారని రైతులు అంటున్నారు.

ధర పెరుగుతోంది



ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన టమాటా పంటకు ధర బాగుంది. రోజురోజుకూ టమాటా ధర పెరుగుతోంది. రెండు రోజులకు 25 నుంచి 30 బాక్సుల టమాటా దిగుబడి వస్తోంది. ఆరందంగా ఉంది. – బద్దం గంగారెడ్డి ,రాయపూర్‌కాండ్లీ

నిలకడగా ఉంది



టమాటా ప్రస్తుత సంవత్సరం నిలకడైన ధర పలుకుతుంది. దీంతో ప్రస్తుత సంవత్సరం మంచి లాభాలు వస్తున్నాయి. గతంలో ఎప్పుడు కూడా ఇంత నిలకడగా ధర లభించలేదు.
– ప్రకాష్, నగర్‌తండా

సాయం అందించిన 'జాతి రత్నాలు'

సాక్షి స్పందన



సాయం అందిస్తున్న 'జాతి రత్నాలు' బృందం

బోథ్: మండలంలోని గుర్రాల తండా గ్రామంలో ని మల్హారి సింగ్ కుటుంబ దీనగాథను సాక్షిలో ఈ నెల 3వ తేదీన 'ఇంటికి పెద్దదిక్కు..ఆ చిన్నారి' శీర్షికన ప్రచురితమైంది. మల్హారి సింగ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, ఓ కూ తురు మానసిక వికలంగురాలు, చిన్నకూతరు మాట్లాడలేదు. దీంతో చిన్న కూతురు గంగోత్రి పై కుటుంబ బాధ్యతలు పడ్డాయి. సాక్షిలో ప్ర చురితమైన కథనానికి మానవతావాదుల నుంచి స్పందన లభిస్తోంది. కథనాన్ని చూసిన వారు తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నారు. బో థ్ మండల కేంద్రానికి చెందిన 'జాతి రత్నాలు' బృందం సభ్యులు బాధిత కుటుంబానికి రూ. 10,700 ఆర్థిక సహాయాన్ని అందించారు. మానవత్వం బతికే ఉందని నిరూపించారు. బాధిత కుటుంబానికి మానవతావాదులు సహాయం చే యాలని కోరారు. ఈ సందర్భంగా కథనాన్ని ప్రచురించిన సాక్షికి ధన్యవాదాలు తెలిపారు. జా తి రత్నాలు బృందంలో సభ్యుడైన వైద్యులు నవీ న్‌రెడ్డి మల్హారి సింగ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బృందం సభ్యులు వైద్యులు నవీన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఖాలీద్, అల్ల కొండ పోతన్న, రమేష్, విశ్వనాథ్, శ్రీకాంత్, సాగర్‌రెడ్డి, లింగారెడ్డి, మనోహర్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం చేయాలనుకునే వారు ఫోన్‌పే నంబరు 76709 21393 కు పంపించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఆదివాసీ యువతి, యువకులతో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్‌ఏ, ఎస్‌జీటీ, ఇతర ఖాళీ పోస్టులు 2,142, అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,085 ఖాళీ పోస్టులు ఉన్నాయన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీంతో ఆదివాసులకు విద్య పూర్తిగా అగమ్యగోచరంగా తయారైందన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు, హైస్కూల్స్‌లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు లేక ఆదివాసీ విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు స్పందించి వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, విద్యార్థి సంఘం నాయకుడు సలాం వరుణ్, యువజన సంఘం నాయకుడు గెడం శివకృష్ణ, మావల మండల అధ్యక్షుడు ఆత్రం గణపతి, మెస్రం దినేష్, తొడసం ప్రకాష్ ఉన్నారు.

ఘనంగా ఇప్పపువ్వు పండుగ



తిలకిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు



ఇప్పచెట్టుకు పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో ఇప్పపువ్వు పండుగ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, ఐటీడీఏ చైర్మన్ కనక లక్కేరావు పాల్గొన్నారు. ముందుగా ఇప్పచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఇప్పపువ్వు ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. ఇప్పలడ్డు గర్భిణులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. మహిళల్లో రక్తహీనత సమస్య దూరం చేయవచ్చని వివరించారు. అలాగే ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలన్నారు. అనంతరం ఇప్పపువ్వుతో తయారు చేసిన పదార్థాలను పరిశీలించారు. పద్మ శ్రీఅవార్డు గ్రహీత కనక రాజు, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలబాయి, జీవ వైవిధ్య నిర్వహన కమిటీ సభ్యులు తిరుపతి, జిల్లా సార్మెడి దుర్గు, మాజీ ఎంపీటీసీ సలీం, అర్జున్ ఉన్నారు.

పది రోజుల వ్యవధిలో తల్లిదండ్రుల మృతి..

- అనాథలైన ముగ్గురు చిన్నారులు



చిన్నారులను ఓదార్చుతున్న జెడ్పీ చైర్మన్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దొంగచింత (రాంజీగూడ) గ్రామానికి చెందిన జుగ్నక సారు(45), జుగ్నక లక్ష్మీబాయి(40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తండ్రి మే 27న, తల్లి జూన్ 6వ తేదీన మృతిచెందాడు. దీంతో వారి పిల్లలు జుగ్నాక మాన్కు(4), జుగ్నక బాదిరావు(3), అనురాధ (ఏడాదిన్నర) చిన్నారులు అనాథలయ్యారు. వృద్ధులైన అమ్మమ్మ, తాత వద్ద ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ శనివారం దొంగచింతకు వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. నిత్యావసర సరుకులతో పాటు కొంత ఆర్థిక సాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట మర్సుకోల తిరుపతి, సలీమొద్దిన్, అబుజర్, దావుల రమేశ్, ఆత్రం లక్ష్మణ్, గ్రామ పటేల్ తుకారాం ఉన్నారు.

డబుల్ 'కల్యాణ లక్ష్మి'

- ఇద్దరి బిడ్డల పెళ్లి కానుక ఒకేసారి..
- రెండు చెక్కులు అందుకున్న గిరిజన మహిళ



రెండు చెక్కులతో లక్ష్మి

తాంసి: పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు సాయంగా రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వధువు కుటుంబానికి రూ.1,00,116 అందజేస్తోంది. అయితే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ఆడపిల్లల వివాహాలు ఒకే ఏడాదిలో కావడంతో ఆ మాతృమూర్తి రెండు కల్యాణలక్ష్మి చెక్కులను ఒకేసారి అందుకుంది. ఈ ఘటన భీంపూర్ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని బెల్సరీ రాంపూర్ గ్రామానికి చెందిన గెడాం లక్ష్మి గతేడాది తన ఇద్దరు కుమార్తెల వివాహం చేసింది. ఇద్దరికి ప్రభుత్వం తరఫున వివాహ కానుక ఒకేసారి మంజూరైంది. ఈమేరకు మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాపూరావు చేతుల మీదుగా లక్ష్మి రెండు చెక్కులను అందుకుంది. ప్రభుత్వ సాయం మరువలేనని తెలిపింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో నివా సం ఉంటున్న ఇ.విజయ్‌లాల్ ఇంట్లో చోరీ జ రిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... విజయ్‌లాల్ కుటుంబ స భ్యులు ఈనెల 7న ఇంటికి తాళం వేసి ఆసిఫా బాద్‌కు వెళ్లారు. తిరిగి శనివారం ఇంటిరాగా ఇంటి తలుపు తాళాలు, బీరువా తాళం పగలగొట్టి అందులోని తులం బంగారం, 15 తు లాల వెండి ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కే సు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రిపుల్ రైడింగ్ చేసి... నంబర్‌ను దాచి



ట్రిపుల్ రైడింగ్ ప్రమాదకరమని, వాహన నంబర్లు కన్పించేలా ప్రయాణం చేయాలని పోలీసులు పదేపదే చెబుతున్నా.. కొంతమంది వాహనదారులకు చెవికెక్కడం లేదు. ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్‌తో నిబంధనలకు విరుద్ధంగా వెళ్తున్న ముగ్గురు యువకులు ఫైన్ పడకూడదనే ఉద్దేశంతో తమ నంబర్‌ప్లేట్ కన్పించకుండా ఓ యువకుడు కాలును అడ్డుపెట్టిన ఈ దృశ్యం నిర్మల్ జిల్లా కేంద్రంలో కన్పించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

జాతీయ రహదారి నిర్వహణ గాలికేనా?



దేవాపూర్ చెక్‌పోస్టు సమీపంలో అధ్వానంగా జాతీయ రహదారి





మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగా నుంచి నిర్మల్ జిల్లా సోన్ వరకు గల 44వ జాతీయ రహదారి పలు చోట్ల అధ్వానంగా తయారైంది. అక్కడక్కడ పగుళ్లతో కంకర తేలడంతో పాటు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా తయారైంది. దేవాపూర్ చెక్‌పోస్ట్ సమీపంలో ఏర్పడిన గుంతులు ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారి గుండా ప్రయాణించే వాహనదారులకు టోల్ రూపంలో పన్నులను వసూలు చేస్తున్న గుత్తేదారు రోడ్డు నిర్వహణను గాలికొదిలేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదాలు జరుగకముందే మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ - ఆదిలాబాద్

నెలరోజుల తరువాత స్వగ్రామానికి..

గుండెపోటుతో దుబాయ్‌లో మృతిచెందిన న్యూకంజర్ వాసి



గంగాధర్(ఫైల్)

లక్ష్మణచాంద: బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి విగతజీవిగా ఇంటికి చేరిన విషాదకర సంఘటన మండలంలోని న్యూ కంజర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆడెపు గంగాధర్(47) కొంతకాలంగా బతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్తున్నాడు. తన కుమార్తె వినిష వివాహానికి తొమ్మిది నెలల కిందట ఇంటికి వచ్చిన గంగాధర్ అనంతరం దుబాయ్ వెళ్లాడు. మే 8వ తేదీన పనిచేసే క్రమంలో గుండెపోటుకు గురై మృతి చెందాడు.

నెలరోజులుగా ఎదురుచూపు..

గత నెల 8న గుండెపోటుతో మృతి చెందిన గంగాధర్ మృతదేహం ఎట్టకేలకు శనివారం 5గంటలకు తన స్వగృహమైన న్యూ కంజర్‌కు చేరింది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అక్కడి వారిని కంటతడిపెట్టించాయి. బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్యన అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి భార్య గంగామణి, కుమారులు వినయ్ విజయ్, కుమార్తె వినీషలు ఉన్నారు.

ఫోన్ మాట్లాడవద్దన్నందుకు యువతి ఆత్మహత్య



వెంకటమ్మ మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: ఫోన్‌లో మాట్లాడవద్దని తండ్రి మందలించడంతో కూతురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ వివరాల ప్రకారం... తలమడుగు మండలం పల్లి–కే గ్రామానికి చెందిన అర్జున్ కుమార్తె ఆత్రం వెంకటమ్మ (19) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. పట్టణంలోని అశోక్‌రోడ్ సమీపంలో పోచమ్మ గుడి దగ్గర బంధువులతో కలిసి అద్దెకుంటూ చదువు చదువుకుంటుంది. శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో తండ్రి వారు అద్దెకుంటున్న రూంకు వెళ్లగా ఆ సమయంలో ఫోన్‌లో మాట్లాడుతూ కన్పించింది. దీంతో తండ్రి ఆమెను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువతీ రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన బంధువులు ఆమెను రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడిలో గాయపడిన వృద్ధుడి మృతి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నారాయణ నాయక్

నిర్మల్‌టౌన్: దాడిలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. నిర్మల్‌రూరల్ సీఐ నారాయణ నాయక్ వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన ఆయిటి రాజశేఖర్ ఈ నెల 8న సాయంత్రం అదే గ్రామానికి చెందిన వరుసకు మామ ద్యవరి గంగన్న(63) ఇంటికి మద్యం తాగి వెళ్లి డబ్బులు కావాలని అడిగాడు. గంగన్న డబ్బులు లేవనడంతో కట్టెతో దాడిచేయగా తలకు బలమైన గాయమై పడిపోయాడు. దీంతో రాజశేఖర్ అక్కడి నుంచి పారిపోయాడు. గంగన్న కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

జిల్లాలో చెస్ క్రీడాభివృద్ధికి కృషి

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో చెస్ క్రీడాభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. గోలేటి టౌన్ షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు శనివారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని క్రీడలతో సమానంగా చెస్‌ను సైతం వృద్ధిలోకి తీసుకువస్తామన్నారు. అందులో భాగంగా అధిక సంఖ్యలో క్రీడాకారులు చెస్‌పై ఆసక్తి చూపేలా పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లా, ఆరు జిల్లాల స్థాయి పోటీలను నిర్వహించగా తాజాగా రాష్ట్ర స్థాయి పోటీలు సైతం జిల్లాలో ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మారుమూల ప్రాంతమైనప్పటికీ గోలేటిలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు రావడం సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో సుమారు 124 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వివరించారు. ఆదివారంతో పోటీలు ముగుస్తాయని, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చే క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ఎం.రవీందర్, గోపాలక్రిష్ణ, కోశాధికారి మల్లేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, బాల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, కోచ్ కల్పన పాల్గొన్నారు.

ప్రాణం తీసిన చేపల వేట

బెల్లంపల్లిరూరల్: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ఏరియాకు చెందిన జంపం సమ్మయ్య(35) చేపల వేటకు వెళ్తున్నట్లు శుక్రవారం సాయంత్రం ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో సమీపంలో వెతికారు. శనివారం సాయంత్రం బెల్లంపల్లి పోచమ్మ చిన్న చెరువులో మృతదేహం బయటకు తేలడంతో తాళ్లగురిజాల పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సమ్మయ్య మృతదేహంగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. చేపలు పడుతున్న క్రమంలో సమ్మయ్య ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.